
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
ఆదివారం 7 జనవరి 2024



సండే స్పెషల్ — ఆదివారం ప్రత్యేకం



కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన స్వర్ణోత్సవ స్థూపం

ఆ కళాశాల.. చదువుల ఊయల

కక్షలు, కార్పణ్యాలు రగిలిన చోట విద్యా కుసుమాలు విరబూశాయి. నిత్యం పగలు ప్రతీకారాలతో అట్టుడికిన ఆ ప్రాంతంలో అక్షర పరిమళాలు వెదజల్లాయి. వర్గాల పేరుతో.. అర్థంపర్థం లేని పగలతో ఒకరిని ఒకరు తెగ నరుక్కున్న కాలంలోనే కొందరు విద్యకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తించారు. ఇందులో భాగంగానే ఆలూరుకు కేటాయించిన కళాశాలను తమ ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని 1971లో అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. కాలేజీకి అవసరమైన స్థలాన్ని దాతల ద్వారా సేకరించడంతోపాటు నాటకాల ద్వారా వచ్చిన డబ్బును కార్పస్ ఫండ్‌గా చెల్లించి అనుకున్నది సాధించారు. ఇలా పత్తికొండలో 1971లో జూనియర్ కళాశాల ప్రారంభమైంది. నాటి నుంచి ఈ కళాశాలలో ఎంతో మంది విద్యార్థులు చదువుకున్నారు. వారిలో చాలా మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. ఈ కళాశాల స్వర్ణోత్సవాన్ని 2022 డిసెంబరు 10న ఓ అపూర్వ ఘట్టంలా ఆవిష్కరించారు. 50 వసంతాల వేడుకను ప్రతి విద్యార్థి మదిలో గుర్తుండిపోయేలా చేశారు. కళాశాల ప్రారంభం నుంచి చదువుకున్న 50 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడంతోపాటు అప్పటి నుంచి చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఇందుకు గుర్తుగా స్వర్ణోత్సవ సంబరాల స్థూపాన్ని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ నెల 7న ఈ స్థూపాన్ని ప్రారంభించాలని ముహూర్తం నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

పత్తికొండ, జనవరి 6:

కళాశాల ప్రస్థానం ఇలా..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో పత్తికొండది ప్రథమ స్థానం. 1970 ప్రాంతంలో ఇక్కడ హైస్కూల్(ఎస్ఎస్ఎల్‌సీ) వరకే ఉండేది. అది కూడా అద్దె భవనంలో కొనసాగేది. ఆ తర్వాత పీయూసీ చదవాలంటే కర్నూలు, అనంతపురం వంటి పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో చాలా మంది హైస్కూల్‌తోనే చదువు ఆపేసేవారు. ఈ క్రమంలోనే హైస్కూల్‌కు సొంత భవనం కావాలని కొందరు పెద్దలు కమిటీగా ఏర్పడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. అధికారులు స్పందించి స్థలం చూపితే భవనాలు నిర్మిస్తామని చెప్పారు. దీంతో కొందరు దాతల సహకారంతో కమిటీ పెద్దలు పట్టణ శివారులో ఏడు ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇందులోనే ప్రభుత్వం పక్కా భవనాలు కట్టించింది. 1971 సంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సీ స్థానంలో ప్రస్తుతం ఉన్న హైస్కూల్ (పదో తరగతి)లోనే ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశ పెట్టింది. వాస్తవానికి ఈ ఇంటర్మీడియట్ కళాశాలను పక్కనే ఉన్న ఆలూరులో ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం భావించింది. అయితే పత్తికొండ ప్రాంతంలో చాలా మంది ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, ఇక్కడే కొత్త కళాశాల కేటాయించాలని ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం దిగి వచ్చింది. అందుకు స్థలం చూపాలని, అలాగే రూ.25 వేలు కార్పస్ ఫండ్ కింద ప్రభుత్వానికి చెల్లించాలని అధికారులు షరతులు విధించారు. దీంతో హైస్కూల్‌లోనే కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని కమిటీ పెద్దలు చూపారు. కార్పస్ ఫండ్ కోసం కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేసి నిధులను సమీకరించారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించడంతో పత్తికొండకు కళాశాల మంజూరైంది. 1971లో షెడ్లలో ప్రారంభమైంది. ఆ తర్వాత పక్కా భవనాలు ఏర్పాటు చేసుకొని 50 వసంతాలు పూర్తి చేసుకొని వేలాది మంది విద్యార్థులను ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దింది.

చదువు ప్రాముఖ్యతను గుర్తించి..

1987-89 బ్యాచ్ విద్యార్థులు చదువుకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తించారు. తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి సహకారం అందించాలని భావించారు. కళాశాల విద్యార్థులకు కంప్యూటర్లు అందించారు. ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కళా భవన్ నిర్మించారు. 2010లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి గురువులకు సన్మానం చేశారు. పట్టణ ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 2022లో కళాశాల 50 వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రారంభం నాటి నుంచి చదువుకున్న 50 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులను ఒక వేదికపైకి తెచ్చారు. ఇందుకోసం అన్ని గ్రూపుల సభ్యులతో కలిసి కమిటీ ఏర్పాటు చేశారు. టీంగా పని చేసి ఆరు నెలలు కష్టపడ్డారు. 1971 నుంచి చదువుకున్న 50 గ్రూపుల విద్యార్థుల వివరాలు సేకరించి స్వర్ణోత్సవ వేడుకలకు ఆహ్వానించి ఘనంగా నిర్వహించారు.

- ఫ్యాక్షన్ ఘర్షణల మధ్యనే విద్యకు ప్రాధ్యానం
- జూనియర్ కళాశాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి
- దాతల సహకారంతో స్థల సేకరణ
- నాటకాల ద్వారా కార్పస్ ఫండ్ చెల్లింపు
- 1971లో కాలేజీ ఏర్పాటు
- 50 వసంతాల అద్భుత ఘట్టం ఆవిష్కరణ
- అన్ని బ్యాచ్‌ల విద్యార్థుతో సమ్మేళనం
- గురువులందరికీ సన్మానం
- నేడు స్వర్ణోత్సవ స్థూపం ఆవిష్కరణ



ఉద్వేగం...ఉత్సాహం కలగలిసిన సంబరం

పూర్వ విద్యార్థుల కలయిక అంటే సాధారణంగా ఆ ఏడాది తమతో కలిసి చదువుకున్న తోటి మిత్రులతో జరుపుకోవడం సర్వసాధారణం. అయితే స్వర్ణోత్సవాల సందర్భంగా కళాశాల ఆరంభం నుంచి చదువుకున్న వారందరినీ ఒకే వేదికపైకి తీసుకు రావాలనుకున్నారు. ఒక తరగతికి చెందిన వంద మంది విద్యార్థులు కలిస్తేనే ఎంతో సందడిగా ఉంటుంది. అలాంటిది వేలాది మంది ఒకే వేదికపైకి చేరితే ఆ సంబరం మరింత అద్భుతంగా ఉంటుందని భావించారు. ఆ ఉత్సాహంతో.. ఉద్వేగంతో 2022 డిసెంబరు 10న జరిగిన స్వర్ణోత్సవాలకు తరలివచ్చారు. తమతో చదువుకున్న మిత్రులతో ఉల్లాసంగా గడిపారు. వేలాది పూర్వ విద్యార్థుల నడుమ జరిగిన ఆ సంబరాన్ని మదిలో దాచుకున్నారు. గురువులకు పాదాభివందనం చేశారు. వారిని సత్కరించి గౌరవాన్ని చాటుకున్నారు.

ఆ మధుర ఘట్టానికి గుర్తుగా..

స్వర్ణోత్సవాలకు గుర్తుగా కళాశాల ఆవరణలో ఒక చిహ్నం ఏర్పాటు చేయాలని పూర్వ విద్యార్థులు భావించారు. కళాశాల ఆవరణలో స్థూపం నిర్మాణం పూర్తి చేశారు. జనవరి 7వ తేదీ స్థూపాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమాన్ని కూడా ఓ పండగ వాతావరణంలా నిర్వహించనున్నారు. ఇందుకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.



కళాశాల 1971-73 మొదటి బ్యాచ్



1986 బ్యాచ్



1987 - 89 బ్యాచ్



అప్పటి జూనియర్ కళాశాల మెయిన్ గేట్ (ఫైల్)

కళాశాల ఎంతో నేర్పింది.. మేం చేస్తున్నది కొంతే



మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన నేను సాధారణ మార్కులతో 10వ తరగతి పూర్తి చేసి కళాశాలలో చేరాను. కళాశాల ఎందరో మిత్రులను నాకు పరిచయం చేసింది. ఆడుతూ పాడుతూ మిత్రులతో కళాశాలలో గడిపిన జ్ఞాపకాలు ఇప్పటికి నా మనసులో పదిలంగా ఉన్నాయి. ఇంటర్‌లో కూడా సాధారణ మార్కులు వచ్చాయి. మా జువాలజీ అధ్యాపకుడు కుళ్లాయప్ప సార్ నాకు ఆ సమయంలో ఎంతో ధైర్యాన్నిచ్చారు. చదవాలి, నేర్చుకోవాలి అన్న తపన నీలో ఉంది. ఎంసెట్ రాయి అని చెప్పారు. ఆయన ఇచ్చిన సలహాతో ఎంసెట్ రాసి ఎంబీబీఎస్ సీట్ సాధించాను. వైద్య వృత్తిలో మంచి పేరు సంపాదించాను. ఆ తర్వాత ఎండీ, డీఎం పూర్తి చేసి తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. నేను ఈ స్థితికి రావడానికి కారణం జూనియర్ కళాశాలే. మా కళాశాలలో చదువుకున్న ఎందరో ఎంతో ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారు. కళాశాలకు మేం ఎంత చేసినా తక్కువే.

- డాక్టర్ రామారావు, పూర్వ విద్యార్థి

షెడ్‌లలో చదువుకున్నాం



1971లో కళాశాల ప్రారంభం కావడంతో నేను అడ్మిషన్ కోసం వెళ్లాను. మొదటి ప్రిన్సిపాల్‌గా రామచంద్రమూర్తి నియమితులయ్యారు. దీంతో రామ్ పేరు ఉన్న విద్యార్థినినే మొదటగా తీసుకోవాలని భావించారు. దీంతో అడ్మిషన్‌కు వచ్చిన విద్యార్థులలో రామ్ అన్న పదం నా పేరులోనే ఉండడంతో మొదటి అడ్మిషన్ నాకు ఇచ్చారు. 50 వసంతాలు పూర్తి చేసుకున్న కళాశాలలో నేనే మొదటి విద్యార్థి కావడం ఎంతో గర్వంగా ఉంది. కళాశాల మొదట్లో భవనాలు లేకపోవడంతో రేకుల షెడ్లలోనే తరగతులు నిర్వహించేవారు. ఎండకు ఇబ్బందులు పడుతూనే కళాశాల చదువును పూర్తి చేశాం. అప్పట్లో ఎండవేడికి మాకు కలిగిన ఇబ్బందికంటే ఇంటర్ కళాశాల అందుబాటులో ఉందన్న ఆనందం ఎక్కువగా ఉండేది.

- రామ్మోహన్, కళాశాల మొదటి విద్యార్థి

జీవిత పాఠం కళాశాలలోనే నేర్చుకున్నాను



మా కళాశాలలో గురుదేవులు నేర్పించిన చదువుతోనే నేటి ఉద్యోగం, జీవితం. నా జీవితంలోని ప్రతిపేజీలోనూ అది ప్రతిబింబిస్తుంది. ఉన్నతంగా ఎలా జీవించాలి, పది మందికి ఎలా సహాయం చేయాలి అని మాగురువుల నేర్పారు.

- అమీనాబీ, అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్, తెలంగాణ

గురువులు చూపిన మార్గనిర్దేశం, అండగా నిలిచిన స్నేహం



నా కళాశాల అనుభవాలు పంచుకోవడం ఆనందంగా ఉంది. మేం చదువుకున్న తరగతి గదులు మాకు విజ్ఞానాన్ని అందించిన వారధులు. గురువులు నేర్పిన పాఠాలు, చేసిన మార్గనిర్దేశాలు నేటి మా జీవన విధానాలకు సాక్ష్యాలు. అల్లరితోపాటు స్నేహితులతో పంచుకున్న గడిపిన క్షణాలు తీపి గుర్తులు. పూలరెమ్మలతో చేసిన గాలిబుడగలు, వేసవిలో వారితో కలిసి తిన్న ఐస్‌క్రీంలు అన్నీ గతాన్ని గుర్తు చేస్తున్నాయి. - లక్ష్మీబాయి, మార్కెటింగ్ డైరెక్టర్, తెలంగాణ

ఈ జీవితం గురువులు పెట్టిన భిక్ష



పత్తికొండకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండు తండా అనే గిరిజన గ్రామం మాది. ఐదో తరగతి వరకు చెట్టుకింద గ్రామంలో ఉన్న బడిలో చదివాను. అమ్మకు చదువంటే ఇష్టం కావడంతో నన్ను పత్తికొండ హాస్టల్లో ఉంచి చదివించింది. ఆ తర్వాత బయట మిత్రులతో కలిసి రూంలో ఉంటూ ఇంటర్ కళాశాలలో చేరాను. అక్కడ గురువులు చెప్పిన చదువులు, వారు చెప్పిన మంచి విషయాలు భవిష్యత్‌లో ఏం చేయాలన్న ఆలోచనను కలిగించాయి. మ్యాథ్స్ అధ్యాపకులు సర్వేశ్వరావు, నాగేశ్వరరావు ఇంజనీరింగ్ వైపు వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. దీంతో ఎంసెట్ ద్వారా సీటు సాధించి ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ప్రస్తుతం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ ఇంజనీర్‌గా పని చేస్తున్నాను. నాకు ఇంతటి అవకాశం రావడానికి నాడు నా గురువులు పెట్టిన భిక్షగానే భావిస్తాను.

- క్రిష్ణానాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్

ఫ్యాక్షన్ గ్రామం నుంచి కస్టమ్స్ ఆఫీసర్‌గా వచ్చాను



మాది దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామం. మా గ్రామంలో ఫ్యాక్షన్ ఎక్కువ అలాంటి వాతావరణంలో ఐదో తరగతి పూర్తి చేశాను. అమ్మకు నన్ను చదివించాలని ఆశ. దీంతో పత్తికొండలో రూమ్ తీసి మాకు తోడుగా నాన్నమ్మను ఉంచింది. అలా హైస్కూల్ చదువు పూర్తి చేసుకొని ఇంటర్‌లోకి ప్రవేశించాను. మేం చదివే సమయంలో స్టూడెంట్ ఆర్గనైజేషన్స్ కళాశాలలో కీలకంగా పని చేసేవి. నేను ఎస్ఎఫ్ఐలో పని చేసేవాడిని. అల్లరి ఎంత చేసినా తరగతిలో అధ్యాపకులు చెప్పిన పాఠాలను ఎప్పుడు అశ్రద్ధ చేయలేదు. అప్పటి అధ్యాపకులు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఎంతగానో కృషి చేసేవారు. అధ్యాపకుల మంచిమాటలు భవిష్యత్ ఏం చేయాలో నేర్పించాయి. ఎస్ఎఫ్ఐ నాలో దేన్నయినా ప్రశ్నించడం నేర్పించింది. ఇంటర్ తరువాత ఎంసెట్ ద్వారా ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్రస్తుతం ముంబాయిలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్నాను. నా ప్రస్థానంలో పత్తికొండ జూనియర్ కళాశాల ఎంతో కీలకం. అందుకే కళాశాలలో పూర్వ విద్యార్థులు ఏ కార్యక్రమం నిర్వహించినా ఎంత దూరంలో ఉన్నా హాజరై ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటాను.

- నరేష్, ఇండియన్ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్, ముంబాయి

సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



ఎన్నికలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల (కల్చరల్), జనవరి 6: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్ట నిఘాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో సరిహద్దు ప్రాంతాల్లో నిఘా కేంద్రాల ఏర్పాటుపై జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సమూన్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లను ప్రభావితం చేసే మద్యం, నగదు, ఇతర బహుమతుల పంపిణీ తదితర అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక నిఘా బృందాలను పెంచుకోవాలన్నారు. ఈ బృందాల్లో రెవెన్యూ, పోలీసు, ఇన్‌కంటాక్స్, కమర్షియల్ టాక్స్, బ్యాంక్, సెబ్, అటవీశాఖ అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

నంద్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగుళూరు, రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నంద్యాలలో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. టౌన్ హాల్ సమీపంలోని కేఎస్ఎం (కదరాబాద్ నర్సింగరావు మెమోరియల్) మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఈ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు అందజేస్తారు. ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. వివరాలకు 70759 06669, 98492 13606 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.



మహానందిలో రూ.10 కోట్లతో వసతి గృహం



భక్తుల కోసం నిర్మించాల్సిన వసతి గృహం నమూనా చిత్రం

మహానంది, జనవరి 6: మహానంది క్షేత్రంలో భక్తులకు దేవదాయశాఖ రూ.10.5 కోట్లతో ఆలయ పరిసరాల్లోని నాగనంది సమీపంలో వసతి గృహం నిర్మిస్తున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఈవోతోపాటు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు విజయవాడ గొల్లపూడిలోని దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో స్టేట్ టెక్నికల్ వాల్యువేషన్ కమిటీని కలిశారు. అనంతరం కమిటీ ఆమోదించిన 55 వసతి గదుల నమూనా ఊహా చిత్రాలను విడుదల చేశారు. రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా కర్నూలుకు చెందిన సీవీ నారాయణరెడ్డి నిర్మాణ కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్నట్లు ఈవో తెలిపారు. త్వరలోనే వసతి గదుల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహిస్తామని అన్నారు.

రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి తరలి రండి

మాజీ ఎమ్మెల్యే బీసీ



బనగానపల్లె, జనవరి 6: రాష్ట్రాన్ని సైకో పాలన నుంచి కాపాడుకోడానికి ప్రతి ఒక్కరూ కదలి రావాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమైందన్నారు. ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆ పార్టీకి గుడ్‌బై చెబుతున్నారన్నారు. వైసీపీ అవినీతి, అరాచక పాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. సైకో సీఎం జగన్‌ను ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వైసీపీ పాలనలో మహిళలకు భద్రత లేదన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ భూములనే తేడా లేకుండా వైసీపీ నాయకులు కబ్జా చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి పోయిందన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే టీడీపీతోనే సాధ్యమని ఆయన అన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 6: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈనెల 9న నంద్యాల జిల్లాకు రానున్నారని, ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని హుశేనాపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్ల వైసీపీ అరాచక పాలనకు ప్రతి ఒక్కరూ స్వస్తి పలకాలన్నారు. రా.. కదిలిరా కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్యపరిచాలన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలు అధికారంలోకి రాగానే చంద్రబాబు అమలు చేస్తామన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే 34 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లను 24 శాతానికి చేసిందన్నారు. బీసీ సాధికారయాత్ర చేపట్టడం దుర్మార్గమన్నారు. కరెంటు, బస్సు, డీజిల్, పెట్రోల్, నిత్యావసరాల ధరలు పెంచి జగన్ పేదల నడ్డివిరిచారన్నారు. చెత్తపై పన్ను వేసిన మొట్టమొదటి ముఖ్యమంత్రి జగనేనన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.షాషావలి, రమణ, కేవీ మధు, బజారు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట మోసం

● నిరుద్యోగుల నుంచి రూ.40 లక్షలు వసూలు

నంద్యాల క్రైం, జనవరి 6 : నంద్యాల పట్టణంలో ఓ వ్యక్తి నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశ చూపి డబ్బులు దండుకొని మోసం చేశాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రొద్దుటూరుకు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని నివసిస్తున్నాడు. హైదరాబాద్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి శ్రీకాకుళం, వైజాగ్, విజయవాడ, అనంతపురం, బేతంచెర్ల పట్టణాలకు చెందిన నిరుద్యోగులను నమ్మించాడు. ఒక్కొక్కరి నుంచి రూ.60 వేల నుంచి రూ.3 లక్షల వరకు రూ.40 లక్షల దాకా వారి ఖాతాల నుంచి ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఉద్యోగాలు ఎప్పుడు ఇప్పిస్తావంటూ నిరుద్యోగులు కిరణ్‌కుమార్‌రెడ్డిని పలుమార్లు అడిగితే.. అదిగో ఇదిగో అంటూ తప్పించుకునేవాడు. ఇటీవల కొందరు అతడికి ఫోన్ చేసి ఉద్యోగమైనా ఇప్పించు.. లేదంటే డబ్బు వాపస్ ఇవ్వు అని నిలదీశారు. దీనికి ఉద్యోగా లు ఇప్పిస్తాను ఓపిక పట్టండి.. పదేపదే విసిగిస్తే మీ మీద పోలీసు కేసు పెడతానని బెదిరించాడు. దీంతో నిరుద్యోగులు శనివారం నంద్యాలలో అతడు ఉంటున్న ఇంటి వద్దకు వెళ్లి వాకబు చేయగా ఈ నెల 1వ తేదీనే ఖాళీ చేసి వెళ్లినట్లు తెలుసుకొని అవాక్కయ్యారు. నంద్యాల రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్న సీఐ కె. రాజారెడ్డి కేసు నమోదు చేసుకొని నిందితుడి కోసం గాలిస్తున్నారు.

19 మంది ఎస్‌ఐల బదిలీ

కర్నూలు, జనవరి 6: కర్నూలు జిల్లా వ్యాప్తంగా 19 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ జి.కృష్ణకాంత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారిలో ఎక్కువమంది వీఆర్‌కు వెళ్లగా మరికొందరికి స్థానచలనం కలిగించారు. బదిలీ అయిన వారు తక్షణమే కేటా యించిన స్థానాల్లో విధుల్లోకి వెళ్లాలని ఎస్పీ సూచించారు. బదిలీ పొందిన ఎస్‌ఐల వివరాలు..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వి.శ్రీనివాసులు	హొళగుంద పీఎస్	వీఆర్, కర్నూలు
టీవీఎన్ చిరంజీవి	కర్నూలు త్రీటౌన్ పీఎస్	వీఆర్, కర్నూలు
ఎం.మహ్మద్ రఫి	వీఆర్ కర్నూలు	
	అటాచ్డ్ తాలుకా యుపీఎస్	వీఆర్, కర్నూలు
జాఫర్ హుస్సేన్	కర్నూలు వన్‌టౌన్ పీఎస్	వీఆర్, కర్నూలు
యు.ఎర్రన్న	వీఆర్ కర్నూలు,	
	అటాచ్డ్ కర్నూలు తాలుకా	వీఆర్, కర్నూలు
కేపీ ప్రహ్లాద	మంత్రాలయం పీఎస్	వీఆర్, కర్నూలు
ఎం.కేశవ	ఉమెన్ పీఎస్,	
	డీఎస్‌బీ, కర్నూలు, అటాచ్డ్	కర్నూలు ఎలక్షన్ సెల్
మహ్మద్ ఆలీఖాన్	కర్నూలు తాలుకా యుపీఎస్	డీఎస్‌బీ, కర్నూలు
సోమ్లా నాయక్	కర్నూలు వన్‌టౌన్ పీఎస్,	
	అటాచ్డ్ కె.నాగులాపురం	డీఎస్‌బీ, కర్నూలు
వేణుగోపాల్‌రాజు	మంత్రాలయం పీఎస్	డీఎస్‌బీ, కర్నూలు
ఎన్.సీ.మల్లికార్జున	ఫ్యాక్షన్ జోన్, కర్నూలు	డీఎస్‌బీ, కర్నూలు
సి.ఖాజావలి	కర్నూలు టూటౌన్ పీఎస్	డీఎస్‌బీ, కర్నూలు
ఎం.ప్రేమ	కె.నాగులాపురం పీఎస్,	
	(అటాచ్డ్ దిశా పీఎస్, కర్నూలు)	దిశా పీఎస్, కర్నూలు
కె.గోపీనాథ్	కర్నూలు టూటౌన్, పీఎస్	సీసీఎస్, కర్నూలు
బి.దేవమణి	సీసీఎస్, కర్నూలు	పీసీఆర్, ఆదోని
ఎల్.విజయలక్ష్మి	ఆదోని త్రీటౌన్ పీఎస్	వీఆర్-ఎస్‌పీ, కర్నూలు
ఎం.రామయ్య	ఆదోని త్రీటౌన్ పీఎస్	వీఆర్-ఎస్‌పీ, కర్నూలు
పి.శోభారాణి	వీఆర్, కర్నూలు (అటాచ్డ్	
	కర్నూలు టూటౌన్ యుపీఎస్)	వీఆర్-ఎస్‌పీ, కర్నూలు
జి.రాజన్న	కర్నూలు ట్రాఫిక్ పీఎస్	వీఆర్-ఎస్‌పీ, కర్నూలు

సభా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ


మైదానాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

ఆళ్లగడ్డ, జనవరి 6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 9వ తేదీన ఆళ్లగడ్డకు వస్తుండటంతో కందుకూరు రోడ్డులోని బీబీఆర్ పాఠశాలకు ఎదురుగా 12 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సభా వేదిక స్థలాన్ని ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య శనివారం పరిశీలించారు. సభా వేదిక నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్న వ్యక్తులను మాజీ సీఎం చంద్రబాబునాయుడుకు హెలిప్యాడ్ ఎక్కడ ఏర్పాటు చేశారని, పార్కింగ్, ఎంత మంది ప్రజలు వస్తారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట పట్టణ సీఐ రమేష్‌బాబు, రూరల్ సీఐ హనుమంతనాయక్, విద్యాసాగర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

కర్నూలు, జనవరి 6: మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని అడిషనల్ ఎస్పీ టి.సర్కార్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో జిల్లా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషినల్ ఎస్పీ టి.సర్కార్, ఏఆర్ అడిషినల్ ఎస్పీ జి.నాగబాబు స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. మొదటి రోజు పోలీసు క్రీడాకారులు కవాతు నిర్వహించి వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు విధులు నిర్వహించి మానసిక ఒత్తిడిని జయించడానికి ఒక ఆటవిడుపులా క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని, ప్రతి సంవత్సరం ఈ క్రీడలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ల పోలీసులతోపాటు ఆర్మ్‌డ్ రిజర్వుడ్ పోలీసులు మొత్తం 105 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో కర్నూలు సబ్ డివిజన్ డీఎస్పీ విజయశేఖర్, ట్రైనీ డీఎస్పీ భావన, ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్‌బాషా, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'అనంత'లో లారీ- బైక్ ఢీ

ఇద్దరు ప్యాపిలి యువకుల దుర్మరణం


సునీల్‌బాబు (ఫైల్)


మోహన్ (ఫైల్)

యాడికి, జనవరి 6: అనంతపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్యాపిలికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. యాడికి మండలం రాయలచెరువు గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్డె సునీల్‌బాబు (22), కురుబ మోహన్ (24) అనే ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్‌పల్లి గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మినారాయణ, కుమారుడు వడ్డె సునీల్‌బాబు, దబ్బర శ్రీరాములు కుమారుడు కురుబ మోహన్‌లు స్నేహితులు. అవివాహితులు. సునీల్ అరటికాయలు కోయడానికి కూలి పనులకు వెళ్లేవాడు. శనివారం సునీల్‌బాబు, మోహన్‌లు తమ సొంత పనుల నిమిత్తం తాడిపత్రికి వెళ్లారు. పనులు ముగించుకొని సొంత గ్రామానికి ద్విచక్రవాహనంలో బయలు దేరారు. యాడికి మండలం రాయలచెరువు గ్రామ సమీపాన జాతీయ రహదారిపై వీరు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని తాడిపత్రి వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొంది. ద్విచక్రవాహనంలోని సునీల్‌బాబు, మోహన్‌లు రోడ్డుపైకి ఎగిరిపడి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీని డ్రైవర్ ఆపకుండా వెళ్లాడు. కిలోమీటర్ దూరంలో లారీ ఆపి, డ్రైవర్ పరారయ్యాడు. మృతుల కు టుంబసభ్యుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

● 12వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

● ఆందోళన ఉధృతం చేస్తామన్న కార్మికులు


ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నంద్యాల టౌన్, జనవరి 6: నంద్యాల మున్సిపల్ కార్యాలయాన్ని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికులు ముట్టడించారు. శనివారం మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 12వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి గౌస్, కార్మిక సంఘం నాయకులు కృష్ణయ్య, భాస్కరాచారి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటును దిగ్బంధించారు. అక్కడే బైఠాయించి ధర్నా చేశారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు సమ్మెను విరమించబోమని, మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ, కార్మిక సంఘం నాయకులు స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. జీతాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పకతప్పదని హెచ్చరించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్షను 4వ రోజు చేశారు. ఆకులు తింటూ వినూత్న తరహాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. సీఐటీయు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విడివిడిగా నిర్వహించిన మున్సిపల్ కార్మికుల ఆందోళన కార్యక్రమాలకు ఐయుఎంఎల్ నాయకులు మద్దతు తెలిపి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు డి. శ్రీనివాసులు, కార్యదర్శి భూమా శ్రీనివాసులు, భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కలెక్టర్ జి. సృజన


మాట్లాడుతున్న కలెక్టర్ డా.జి. సృజన

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 6: ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను పాటించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు ఆఫీసర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే సమయంలో ఏయే పనులు చేయాలి.. ఏవి చేయకూడదనే విషయాలను విపులంగా వివరించారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో నిర్దేశించిన కనీస సౌకర్యాల ఏర్పాటుపై మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి సెక్టారు అధికారి పరిధిలో 13 నుంచి 14 పోలింగ్ స్టేషన్‌లు ఉండవచ్చని, కనీస సౌకర్యాలు ఉన్నాయా లేదా అని సెక్టార్ అధికారి సెక్టార్ పోలీసు ఆఫీసర్ కలిసి పరిశీలించాలని ఆదేశించారు. తాగునీరు, ర్యాంపు, ఫర్నీచర్, విద్యుత్, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ నెల 31వ తేదీలోపు రెండు సార్లు పోలింగ్ స్టేషన్లను సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ఎన్నికల్లో సెక్టారు ఆఫీసర్లు, సెక్టారు పోలీసు ఆఫీసర్ల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. సెక్టారు పోలీసు ఆఫీసర్లు వారికి కేటాయించిన లోకేషన్లను తరచుగా తనిఖీ చేసి సమస్యలు సృష్టించే వ్యక్తులు, సమస్యాత్మక గ్రామాల పోలింగ్ కేంద్రాల వివరాలను సెక్టార్ ఆఫీసర్లకు ఇచ్చినట్లయితే వారు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్తారని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్యా, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, కర్నూలు ఆర్డీవో హరిప్రసాద్, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

జైలు తనిఖీ


ఆహారాన్ని రుచి చూస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), జనవరి 6: నగర సమీపంలోని పంచలింగాలలో ఉన్న జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. ఖైదీల గదులు, రికార్డులు, వారికి అందిస్తున్న మెనూను పరిశీలించారు. ఖైదీలకు ఇస్తున్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా అందజేస్తామని అన్నారు. అర్హులైన ఖైదీలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే తాము న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈయనతో పాటు చీఫ్ డిఫెన్స్ లీగల్ ఎయిర్ కౌన్సిల్ మనోహర్, జిల్లా జైలు పర్యవేక్షణాధికారి ఘనే నాయక్ తదితరులు ఉన్నారు. ఆ తర్వాత ఆయన స్థానిక నగరంలోని మహిళా జైలును కూడా తనిఖీ చేశారు.

చట్టబద్ధ పాలన గాడి తప్పింది

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జనవరి 6: రాష్ట్రంలో రాష్ట్రంలో చట్టబద్ధ పాలన గాడి తప్పిందని, దారిలోకి రావాలంటే చంద్రబాబు రావాల్సిందేనని జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక శాంతి భద్రతలు కరువయ్యాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సామాజిక వర్గాలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో కులాలు, మతాల పేరుతో విడదీసి ఒకరిపై ఒకరికి ద్వేషం కలిగించేలా రెచ్చగొట్టించి గడిచిన నాలుగున్నేరేళ్ల కాలం పబ్బం గడుపుకున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాలు దగా పడ్డాయని, ప్రభుత్వ ప్రైవేట్ అనే తేడా లేకుండా పిల్ల సైకో నాయకులు కూడా ఆస్తులు, భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీని గద్దె దింపేందుకు, ప్రజలను చైతన్యం చేసేందుకు చంద్రబాబు జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రా కదలిరా.. అంటూ శంఖారావం పేరుతో అన్ని పార్లమెంట్ల పరిధిలో బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సభల ద్వారా టీడీపీ సూపర్ సిక్స్ పథకాలైన మహాశక్తి, యువగళం, అన్నదాత, బీసీ రక్షణ చట్టం, ఇంటింటికి నీరు, పూర్ టు రిచ్ అనే కార్యాక్రమాలు ఎలా చేపడతామనే దానిపై ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ అనే కార్యక్రమం ద్వారా ఇంటింటికి టీడీపీ కార్యక్రమం ద్వారా 75 శాతం ప్రజలకు వివరిస్తూ బాండ్లు అందజేస్తున్నామని వివరించారు. బీసీ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు వారి పర్యటనలో బీసీ రాష్ట్ర స్థాయి నాయకులు హాజరు కానున్నారని, సమస్యలను వివరించాలని కోరారు.

నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడించిన ఆత్మకూరు డీఎస్పీ


నిందితుడిని మీడియా ఎదుట హాజరుపర్చిన ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు, జనవరి 6: ఆత్మకూరు పట్టణ శివార్లలోని పంట పొలాల్లో ఓ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. శనివారం ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు నిందితుడ్ని మీడియా ఎదుట హాజరుపర్చి వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన శంకరయ్య అనే యువకుడు మద్యం తాగి శుక్రవారం ఉదయం పట్టణ శివార్లలోని పొలానికి వచ్చిన మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఆ సమయంలో మహిళ బంధువులు అటు రావడంతో నిందితుడు సమీపంలోని మొక్కజొన్న చేనులోకి వెళ్లి దాక్కున్నాడన్నారు. జొన్న చేనులో ఉన్న నిందితుడ్ని అరెస్టు చేశామని తెలిపారు. నిందితుడు శంకరయ్య గతంలో కూడా పట్టణ శివార్లలో మార్నింగ్ వాక్‌కు వచ్చిన మహిళపై దాడి చేసినట్లు తెలిపారు. 24గంటల్లోగా నిందితుడ్ని పట్టుకున్న ఆత్మకూరు సీఐ నాగభూషణ్, ఎస్సైలు జీ.కృష్ణమూర్తి, వెంకటనారాయణరెడ్డిలను ఆయన అభినందించారు.







నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఎస్మాకు భయపడం

ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా భయపడేది లేదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. 26 రోజులుగా సాగుతున్న అంగన్‌వాడీల ఆందోళనపై ప్రభుత్వం శనివారం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడంతో అంగన్‌వాడీ వర్కర్లు కోపోద్రిక్తులయ్యారు. '26 రోజులుగా సమ్మె చేస్తున్నాం.. ఇప్పుడు ప్రభుత్వానికి అత్యవసర సేవలు గుర్తుకొచ్చాయా? అత్యవసర సేవలు అందించే వారికి కనీస వేతనాలు అమలు చేయాలనే ఆలోచన ఎందుకు రాలేదు. మీరు అమలు చేస్తామన్న హామీ కోసమే మేం ఆందోళన బాట పట్టాం. సమ్మె నోటీసు ఇచ్చినపుడు ఎందుకు స్పందించలేదు. మా న్యాయమైన కోర్కెలు నెరవేర్చేదాకా ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా అదరం.. బెదరం' అంటూ అంగన్‌వాడీలు ముక్తకంఠంతో నినదించారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల నిరవధిక దీక్షలు 26వ రోజు కూడా కొనసాగాయి. నందికొట్కూరు, పగిడ్యాలలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డిని అంగన్‌వాడీలు అడ్డుకొని తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. మహానంది మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన నిరాహార దీక్ష శిబిరాన్ని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సందర్శించి మద్దతు ప్రకటించారు. ఆత్మకూరు పట్టణం గౌడ్‌సెంటర్, జూపాడుబంగ్లాలో అంగన్‌వాడీ వర్కర్లు, సీఐటీయూ నాయకులు కలిసి జీవో నెంబర్ 2 ప్రతులను దహనం చేశారు. పాములపాడులో ఒంటికాలిపై నిలిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీ వర్కర్లను జైల్లో నిర్బంధించేందుకు ప్రభుత్వం నిరంకుశంగా తెచ్చిన జీఓ 2ను రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయి.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


పాములపాడులో అంగన్‌వాడీల ఒంటికాలిపై నిరసన


నందికొట్కూరులో నిరవధిక దీక్షలు చేస్తూ..


పగిడ్యాలలో జేసీ కారును అడ్డుకొన్న అంగన్‌వాడీలు



గోస్పాడు, నంద్యాలలో నిరవధిక దీక్షలు కొనసాగిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



ఆత్మకూరులో జీఓ 2 కాపీలు దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు, బండిఆత్మకూరులో అంగన్‌వాడీల ప్రదర్శన

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

12వ రోజూ కొనసాగిన పారిశుధ్య కార్మికుల ఆందోళన


నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్నకార్మికులు

ఆత్మకూరు, జనవరి 6: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 12వ రోజు శనివారం మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించి నిరసన తెలిపారు. కమిషనర్ శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, రజాక్ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగు రాజు మాట్లాడుతూ.. 2019 ఎన్నికల ముందు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ అధికారంలోకి రాగానే విస్మరించారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు తిమ్మయ్య, నాగన్న, మోహన్, సురేష్, దానమయ్య, రవి, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, సుశీలమ్మ ఉన్నారు.

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్లు చేస్తున్న సమ్మె 12వ రోజూ కొనసాగింది. సీఐటీయూ నాయకులు గోపాల క్రిష్ణ, ఉస్మాన్‌బాషా, మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు భాస్కర్, పరమేష్, మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి మున్సిపల్ వర్కర్లంటే చిన్న చూపులా ఉందని, తమ సత్తా ఏంటో భవిష్యత్తు కార్యచరణ ద్వారా చూపుతామని హెచ్చరించారు.

న్యాయం చేయకపోతే సమ్మె ఉధృతం


నంద్యాలలో దీక్షా శిబిరంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 6: సమగ్ర శిక్షా ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సమగ్ర శిక్షా జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరధిక సమ్మె కొనసాగుతున్నాయి. శనివారం నంద్యాలలో దీక్షా శిబిరంలో ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఛలో విజయవాడ పిలుపులో ఉద్యోగస్థులను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేసి నిర్బంధించినా విజయవాడ ముట్టడి విజయవంతమైందని గుర్తు చేశారు. ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తే ఊరుకునే ప్రశక్తేలేదని, ఇచ్చిన హామీల మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

ప్రజల కష్టాలు తీరాలంటే టీడీపీ రావాల్సిందే


భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాల గురించి వివరిస్తున్న బుడ్డా

ఆత్మకూరు, జనవరి 6: టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని ఏకలవ్యానగర్‌లో బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి పర్యటించి వైసీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాష, అడ్వకేట్ కేశవరెడ్డి, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, రాజారెడ్డి, నాగూర్‌ఖాన్, సుబ్బరాజు, మల్లికార్జునరెడ్డి, ఫక్రుద్దీన్, నబి, హరినాథ్, శ్రావణ్, వెంకటరావు, రవీంద్రబాబు, అన్వర్, నాగేశ్వరరావునాయక్, జనసేన నాయకులు శ్రీరాములు, అరుణ్ తదితరులు ఉన్నారు.

బార్బర్ షాపును తొలగించడం అన్యాయం

మహానంది : చిన్న బార్బర్ షాపును తొలగించి అన్యాయంగా పేదవాని జీవించే హక్కును కాలరాసున్నారని అధికారులపై శ్రీశైలం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానందిలో శనివారం ఆయన టీడీపీ కార్యకర్త సుబ్బరాయుడుకు చెందిన బార్బర్ షాపును సందర్శించారు. అనంతరం బాధితునికి నీకు అండగా తామున్నాని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కొంత నగదును అందజేసారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బార్బర్ షాపు తొలగిస్తారా. ఇది మీకు తగునా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మినీ మేనిఫెస్టోతో వైసీపీలో వణుకు

గోస్పాడు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఇవ్వబోయే మినీ మేనిఫెస్టోను విడుదల చేసినప్పటి నుంచి వైసీపీలో వణుకు ప్రారంభమైందని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడుదాం

కొత్తపల్లి : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న సీఎం జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని పాతమాడుగుల గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వారు టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, సీలం లింగన్న, యూనిట్ ఇన్‌చార్జి రహీంఖాన్, డీలర్ వెంకటస్వామి, జానాల సుధాకర్, పరమేశ్వరరెడ్డి, గడ్డం వెంకటేశ్, మన్సూర్‌భాషా, కురువ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలలో జొన్న కొనుగోలు

గోస్పాడు, జనవరి 6: మండలంలో రబీలో సాగు చేసిన జొన్న రైతుల నుంచి జొన్నలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి స్వప్నిక తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2023-2024 రబీ సీజన్‌లో మండలంలో పది వేల ఎకరాల జొన్నపంట సాగు చేశారని, రైతులు ఈకేవైసీ చేయించుకొని రైతు భరోసా కేంద్రాలలో పంట కొనుగోలుకు తమ పేరును నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం జొన్న పంటకు మద్దతు ధర క్వింటాకు రూ.3,180 నిర్ణయించిందని తెలిపారు. ఎఫ్ఏక్యూ నాణ్యతకు లోబడి పంటలను కొనుగోలు చేస్తారని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వప్నిక రైతులను కోరారు.

జొన్న కొనుగోలు కేంద్రాలు..

నంద్యాల రూరల్, జనవరి 6 : రైతు భరోసా కేంద్రాల్లో జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఇర్ల ప్రసాదరావు తెలిపారు. మంగళవారం పుసు లూరు, మిట్నాల గ్రామాల్లో వ్యవసాయశాఖ స్థానిక రైతులకు జొన్న కొనుగోలు పై అవగాహన సదస్సు నిర్వహించింది. సదస్సులో వ్యవసాయ అధికారి మాట్లాడారు.

దుర్మార్గపు పాలనను తరిమికొడదాం



నంద్యాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

- చంద్రబాబు బహిరంగ సభను జయప్రదం చేయాలి
- నంద్యాల అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 6: ఐదేళ్లలో ప్రజలందరికీ అరాచక, దుర్మార్గపు పాలన ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూపిన జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టడమే లక్ష్యంగా కదలి రావాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్ర ఖలీల్ థియేటర్ ఆవరణలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆళ్లగడ్డకు ఈ నెల 9వ తేదీన చంద్రబాబు రానున్న సందర్భాన్ని పురస్కరించుకొని బహిరంగ సభ విజయవంతం కోసం నాయకులు, కార్యకర్తలతో కార్యాచరణ సమావేశాన్ని నిర్వహించారు. ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రారావు, ఏవీఆర్ ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు పోతురాజు రవికుమార్, ప్రముఖ టీడీపీ నాయకుడు తాతిరెడ్డి తులసిరెడ్డి, దూదేకుల ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ బాబన్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుపల్లి హరిబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో చంద్రబాబు పర్యటనకు నంద్యాల అసెంబ్లీ నుంచి భారీ జనసమీకరణ కోసం ఏర్పాట్లుపై చర్చించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ముల్లా ఇలియాస్, పట్టణ అధ్యక్షుడు ఖలీల్, తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి జైనాబీ, పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రా కదలి రా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం : మాండ్ర

నందికొట్కూరు రూరల్ : ఈ నెల 9న ఆళ్లగడ్డలో నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమాయత్తం కావాలని నంద్యాల టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర వివేకానందరెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అల్లూరు గ్రామంలో ముక్తనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియంత పాలన నుంచి విముక్తి కోసం ప్రతి ఒక్కరూ అలుపెరగకుండా పోరాడాలని కోరారు. మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుండం రమణారెడ్డి, ఓబుల్ రెడ్డి, పలుచాని మహేశ్వరెడ్డి, అల్లూరు గ్రామ సర్పంచ్ నాగలక్ష్మయ్య, జానార్దన్, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

గోస్పాడు: రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. శనివారం గోస్పాడులో పార్టీ కార్యాలయాన్ని నూతనంగా ప్రారంభించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గం అబ్జర్వర్ రవికాంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు హుసేని, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, భూమా హుసేని, వెంకటేష్, త్రిలింగేశ్వరరెడ్డి, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీ గర్జనను విజయవంతం చేయండి

జూపాడుబంగ్లా : టీడీపీ బీసీలకు పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగానే ఈ నెల 9న ఆళ్లగడ్డలో నిర్వహించే బీసీ గర్జనసభకు మాజీ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు వస్తున్నారని సభను విజయవంతం చేయాలని టీడీపీ బీసీ రాష్ట్ర పరిశీలకుడు జిల్లెలశ్రీరాములు అన్నారు. జూపాడుబంగ్లాలో మండల ముఖ్యనాయకుల సమావేశం టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర నాయకులు సుబ్రహ్మణ్యం కృష్ణయ్య యాదవ్, వీరారెడ్డి, రవికుమార్‌యాదవ్, రఘుయాదవ్, బాబు, రమణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఖాజీకురైషన్, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

సభ సక్సెస్ కోసం సమావేశం

పాములపాడు: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పిలుపు ఇచ్చిన రా కదలి రా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తెలుగు తమ్ముళ్లు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ అధ్యక్షుడు మౌలానా మస్తక్ అహ్మద్, నాయకులు మధుక్రిష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు


గౌరు సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ జనవరి 6 : నియోజకవర్గంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసలు ఆగడం లేదు. శనివారం జూపాడుబంగ్లా మండలం తరిగోపుల పంచాయతీలోని రామసముద్రం మజరా గ్రామం నుంచి వైసీపీ నాయకులు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరూవెంకటరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న వైసీపీ రాక్షస పాలనపై విరక్తి చెంది టీడీపీలో చేరుతున్నామని పేర్కొన్నారు. టీడీపీలో చేరినవారిలో పుట్టారంగస్వామి, వెంకటరమణ, శేఖర్, దనుంజయ, సాయికుమార్, చిన్న ఎల్లయ్య, కిషోర్, పెద్దఎల్లయ్య, రాజు, తరుణ్, హరిక్రిష్ణ, రమణ, ఫారుక్ బాషా, అల్తాఫ్, నాగయ్య, పెద్దచెంచులు, దేవదాసు, మద్దిలేటి, బిచ్చన్న, బాలసంజన్న, వెంకటేశ్వర్లు, పెద్దరంగస్వామి, మౌలాలి, రమేష్ తదితరులను గౌరూ వెంకటరెడ్డి టీడీపీ కండువా కప్పి లాంచనంగా టీడీపీలోకి ఆహ్వానించారు.

టీడీపీలోకి పగిడ్యాల వైసీపీ నాయకులు


మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ : అల్లూరు గ్రామంలో నంద్యాల పార్లమెంట్ టీడీపి ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో పగిడ్యాల గ్రామ టీడీపీ నాయకులు పుల్యాల వాసురెడ్డి, రాజశేఖరెడ్డి, దామోధరెడ్డి ఆధ్వర్యంలో పగిడ్యాల మండలం వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో వెంకటేశ్వర్లు, నరసింహం, బాలకృష్ణ, శ్రీనివాసులు, పెద్దబిచ్చాలు, నాగేశవరారావు, సురేష్, గొల్ల రంగస్వామి, చిన్న నరసింహ, దాసు, జగన్, మధు, కురుమన్న, మల్లికార్జున, రమణ, నాగరాజు, శేఖర్, బతుకన్న ఉన్నారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పగిడ్యాల టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరెడ్డి, విజయ్‌కుమార్ ,శేఖర్, డేవిడ్, పాండు, బాబు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

దేశ ఖ్యాతిని పెంచడంలో క్రీడాకారులు కీలకం


క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న చేతన్ ఆనంద్, క్రీడా వందనాన్ని స్వీకరిస్తున్న దృశ్యం, విజేతలకు బహుమతులు అందజేస్తున్న చేతన్ ఆనంద్

నంద్యాల రూరల్, జనవరి 6 : దేశ ఖ్యాతిని పెంచడంలో క్రీడాకారులు ముందు వరుసలో ఉంటారని ప్రముఖ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత చేతన్ ఆనంద్ అన్నారు. ఆర్ఏఎం ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చేతన్ ఆనంద్ క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని పాఠశాల యాజమాన్యాన్ని కోరారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడను ఎంచుకొని వాటిలో నైపుణ్యం సంపాదించాలన్నారు. క్రీడాకారులు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. శారీరక దృఢత్వం కోసం క్రీడలను ఎంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌తో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. దినసరి చర్యలో భాగంగా విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడలు అనారోగ్యాన్ని, వైద్యున్ని దూరం చేస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభ కనబరుస్తూ దేశానికి పేరుప్రఖ్యాతులు తెస్తున్నారన్నారు. పాఠశాలలో సింథటిక్ క్రీడా మైదానాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు కళాశాల ఎండీ శివరాం తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న ధ్యేయంతో రాయలసీమలో మొట్టమెదటిసారిగా రెసోనెన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని ఉన్నత స్థాయి విద్యనందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. క్రీడలో విజేతలకు చేతన్ ఆనంద్ ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గాయత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీఎం లైవ్ టెలికాస్ట్‌ను విజయవంతం చేయండి: జేసీ

పగిడ్యాల, జనవరి 6: వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాంగగా పగిడ్యాల ఆదర్శ పాఠశాలలో నిర్వహించనున్న పీఎం నరేంద్ర మోదీ లైవ్ టెలికాస్ట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టరు రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పగిడ్యాల ఆదర్శ పాఠశాలలో పీఎం లైవ్ టెలికాస్ట్ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను డీపీవో మంజులవాణి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఆర్డీవో దాసు తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఆదర్శ పాఠశాలలో ఎంత మంది కూర్చోవడానికి అనుకూలంగా ఉంటుందని ప్రిన్సిపాల్ స్రుజనను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు, స్టేజీ నిర్మాణానికి సంబంధించిన విషయాలపై ఆరా తీశారు. అనతరం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నవబంరు 25 నుంచి జనవరి 26 వరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల పై అవగాహన కల్పించేందుకు ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగాగానే జిల్లాలో పగిడ్యాల మండలనికి చెందిన ఖాజా అనే వ్యక్తి ప్రధానితో లైవ్‌లో మాట్లాండేందుకు ఎంపికయ్యారని తెపాఆరు. స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి కేంద్ర సమాచార శాఖ మంత్రి, రాష్ట్ర మంత్రులు, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. , ప్రోటోకాల్ ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, జేడీఏ మోహన్‌రావు, ఏజీఎం నహీదా సుల్తానా, తహసీల్దార్ భారతి, ఎంపీడీవో వెంకటరమణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


పగిడ్యాల ఆదర్శ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి

జూపాడుబంగ్లా, జనవరి 6: ప్రతి పొదుపు మహిళ ఆర్థికంగా ఎదిగేందుకు ప్రధానమంత్రి మహిళలను లక్షాధికారులను చేస్తామని చెప్పినమాటలను ఆచరణలో చూపాలని వెలుగు ఏపీఎం అంబమ్మ అన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో వీవోఏ, ఎఫ్‌పీవో, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సంఘాలలో ఆర్థికంగా , అనారోగ్యాల కారణంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించి వారిని యాజమానులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అన్నారు. అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని వారికి సూచించారు. సీసీలు నాగన్న, ధన్‌సింగ్‌నాయక్, నాగేశ్వరరావు, కర్రెన్న, గాంధీ, జయలక్ష్మీలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌ను పరిశీలించిన జేసీ

పాములపాడు, జనవరి 6 : మండలంలోని జూటూరు గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన కేఎస్ఆర్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. శనివారం స్థానిక తహసీల్దార్ రత్నరాధికతో కలసి ఫిల్లింగ్ స్టేషన్ అనుమతి పత్రాలు తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎస్ఓ, సీఎస్‌డీటీ సిబ్బంది పాల్గొన్నారు

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం దారుణం

పాణ్యం, జనవరి 6 : తమ డిమాండ్ల సాధనకై శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం చేయడం దారుణమని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి రాంమోహన్‌నాయుడు అన్నారు. 26 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు శనివారం టీడీపీ ఆధ్వర్యంలో సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ, కేశవ్, అమరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మిలిటరీ సుబ్బారెడ్డి, పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీటీసి రమణ, విజయ్, తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడే ప్రసక్తే లేదు

గడివేముల, జనవరి 6: టీడీపీని వీడే ప్రసక్తె లేదని టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి శనివారం తెలిపారు. తమ రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కొందరు నాయకులు మనోధైర్యం దెబ్బతీసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే, పాణ్యం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరిత, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిల వెంటనే ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. నాయకులు రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు టీడీపీ నాయకులు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి మద్దతు ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

ఆత్మకూరురూరల్, జనవరి 6: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి జరిగిందని ఆ పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు లక్ష్మీనరసింహ, ఇబ్రహీం అన్నారు. శనివారం వారి సమక్షంలో పట్టణంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

బెదిరింపులకు భయపడం

• సమస్యలు పరిష్కరించే దాకా పోరాటం • ఎస్మాను ప్రభుత్వం విరమించుకోవాలి • సమ్మె కొనసాగించిన అంగన్‌వాడీలు



రుద్రవరంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



శిరివెళ్లలో దీక్ష



చాగలమర్రిలో నల్లబ్యాడ్జీలతో నిరసన



బేతంచెర్లలో జీవో ప్రతులను కాల్చుతున్న అంగన్‌వాడీలు

బెదిరింపులకు భయపడబోమని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. సమ్మె శనివారం 26వ రోజు కొనసాగించారు. వారు మాట్లాడుతూ ఎస్మా చట్టం ప్రయోగాన్ని విరమించుకోవాలని, జీవో నెంబరు 2ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులకు దిగడం సరికాదని అన్నారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె కొనసాగుతుందన్నారు. వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



దొర్నిపాడులో ఒంటికాలిపై నిరసన



సంజామలలో..



కోవెలకుంట్లలో పొర్లు దండాలు



డోన్(రూరల్): డోన్ పట్టణంలో..



ఆళ్లగడ్డలో..

'చంద్రబాబు సభను జయప్రదం చేయాలి'

చాగలమర్రి, జనవరి 6: ఆళ్లగడ్డలో 9న జరిగే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. శనివారం చాగలమర్రి టీడీపీ కార్యాలయ ఆవరణలో నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు బహిరంగ సభకు సుమారు లక్ష మందికి పైగా జన సమీకరణ చేస్తున్నామన్నారు. టీడీపీ మండల పరిశీలకుడు ముఖ్తార్, ఆళ్లగడ్డ టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, భార్గవ్‌రామ్, రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, బీసీ సెల్ నంద్యాల అధికార ప్రతినిధి సల్లా నాగరాజు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొర్నిపాడు: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చేపట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం దొర్నిపాడు టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, భార్గవ్‌రామ్‌నాయుడు, దొర్నిపాడు మాజీ మండల అధ్యక్షుడు భూమా బ్రహ్మానందరెడ్డి, లింగుట్ల వెంకట్‌నాయుడు, రమణయ్య, డీలర్ హబీబ్‌బాషా, నారాయణస్వామి, కేశవ నాయుడు, సిద్ధి సత్యం, అమరసింహారెడ్డి, సిద్ధినారాయణ, దయానందరావు, చౌడయ్య, శాంతరావు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

శిరివెళ్ల: ఈ నెల 9న ఆళ్లగడ్డలో జరిగే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్‌నాయుడు పిలుపునిచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన శిరివెళ్ల మండలంలోని నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం మొదలైంది: బీసీ



కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

కొలిమిగుండ్ల, జనవరి 6: వైసీపీ ప్రభుత్వానికి పతనం మొదలైందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో వైసీపీకి చెందిన 50 వైసీపీ కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. గ్రామ టీడీపీ నాయకులు పోతిరెడ్డి రఘురామిరెడ్డి, బొబ్బల మహేశ్వరరెడ్డి, అహమ్మద్, బంగి హుసేనయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీలో చేరిన నాయకులకు టీడీపీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు తోట శివారెడ్డి, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చేది టీడీపీ ప్రభుత్వమే: కేఈ శ్యాంబాబు



వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

ప్యాపిలి, జనవరి 6: వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఆయన శనివారం కలచట్ల గ్రామంలో పరామర్శించారు. ఆయన కుటుంబానికి పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దింపాలి: సుబ్బారెడ్డి

డోన్, జనవరి 6: వైసీపీ అరాచక పాలనతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీని గద్దె దింపడానికి అందరూ కదలిరావాలని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అవినీతి, అరాచక పాలనతో రాష్ట్రాన్ని లూటీ చేశారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములను కబ్జాలకు పాల్పడుతూ వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున అక్రమార్జించారని ఆరోపించారు. కులాల పేరుతో ప్రజలను విడగొట్టి చిచ్చు పెట్టాలని సీఎం జగన్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పిగొట్టడం ఖాయమన్నారు.

అహోబిలంలో స్వాతి వేడుకలు

ఆళ్లగడ్డ, జనవరి 6: అహోబిలంలో లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను అర్చకులు శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో సుదర్శన హోమాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య అశేష భక్తజనాల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. స్వాతి వేడుకల్లో ప్రొద్దుటూరు టీడీపీ మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

'వైసీపీకి గుణపాఠం తప్పదు'



మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చాగలమర్రి, జనవరి 6: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం తప్పదని, చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్తియార్ అన్నారు. శనివారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆళ్లగడ్డలో ఈనెల 9న టీడీపీ అధినేత చంద్రబాబు హాజరయ్యే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లక్ష మందికి పైగా హాజరయ్యేలా సభా ఏర్పాటు చేశారని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని అన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, బీసీ సెల్ నంద్యాల అధికార ప్రతినిధి సల్లా నాగరాజు నాయకులు కొలిమి హుస్సేవలి, కొలిమి షరీఫ్, మౌలాలి, అనిఫ్, శ్యాబుల్, మదార్‌సా, అబ్దుల్‌ఖాదర్, బషీర్, గురుశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఓబులేసు, నాగూర్‌వలి పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అరాచక పాలన'

డోన్, జనవరి 6: సీఎం జగన్ అరాచక పాలన కొనసాగిస్తున్నారని, ప్రజలు విసిగిపోయారని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున అన్నారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో మల్లికార్జున మాట్లాడుతూ ఆళ్లగడ్డలో ఈ నెల 9వ తేదీన జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. వైసీపీ మునిగిపోయే నావాలాంటిదని, సొంత పార్టీ ఎమ్మెల్యేలే గుడ్ బై చెబుతున్నారని అన్నారు. సీఎం జగన్ నియంతృత్వ పోకడలతో ప్రజలకు తీరని నష్టం జరిగిందన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ చంద్రబాబు చేస్తున్న పోరాటానికి ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారన్నారు.

'టీడీపీతోనే పేదరికం నిర్మూలన'



బేతంచెర్లలో పాల్గొన్న టీడీపీ నాయకులు



అలేబాదులో పాల్గొన్న సుబ్బారెడ్డి

ప్యాపిలి, జనవరి 6: టీడీపీ మేనిఫెస్టోతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఆ పార్టీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అలేబాదు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ నియంత పాలనలో ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే బడుగు, బలహీనల వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తారన్నారు. టీడీపీ నాయకులు మురళీకృష్ణగౌడు, వై.లక్ష్మీనారాయణయాదవ్, ఆర్‌ఈ రాఘవేంద్ర, గండికోట రామసుబ్బయ్య, హరికుమార్, శేఖరయ్య, సంజన్న, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: వచ్చే ఎన్నికల్లో గెలిచేది తెలుగుదేశం పార్టీనేనని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి అన్నారు. శనివారం పట్టణంలోని 16వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేకల నాగరాజు, రూబెన్, రంగోపాల్, శ్రీపతినాగరాజు, కానాల అంజి పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని సంగపట్నం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. బీసీ ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో గురించి వివరించారు. బీసీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలు అని అన్నారు. వైసీపీ బండిని ఎమ్మెల్యేలు, ఎంపీలు దిగుతున్నారన్నారు. వైసీపీ పాలనలో భూకబ్జాలు పెరిగిపోయా యని, మహిళలపై దాడులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. నాయకులు ఐవీ పక్కీర్‌రెడ్డి, ఉగ్రసేనారెడ్డి, సింగనపల్లె సాంబశివారెడ్డి, రామాపురం మారం పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై కేసు నమోదు

బేతంచెర్ల, జనవరి 6: అంబాపురం గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు బేతంచెర్ల ఎస్ఐ శివశంకర్ నాయక్ శనివారం తెలిపారు. అంబాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ శ్రీనివాసులు 2019లో ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 1161లో ఉన్న ప్రభుత్వ భూమిని తన పూర్వీకులకు చెందినదని, పట్టాదారు పాసు పుస్తకాలను తనతో పాటు తన తండ్రి, భార్యలపై నకిలీ పత్రాలను సృష్టించారని తెలిపారు. తనకు చెందిన భూమి అని మల్కాపురం యూనియన్ బ్యాంకులో పెట్టి రుణం తీసుకుని మోసం చేశారని బేతంచెర్ల తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. డోన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ తెలిపారు.

'చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం లేదు'

డోన్(రూరల్), జనవరి 6: అంగన్‌వాడీ వర్కర్ల సమ్మెతో అంగన్‌వాడీ కేంద్రాలు సచివాలయ సిబ్బంది సహకారంతో తెరిచినప్పటికీ చాలా గ్రామాల్లో చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం లేదని డోన్ ఐసీడీఎస్ సీడీపీవో షంషాద్ బేగం తెలిపారు. శనివారం పట్టణంలోని నూతన ఆర్అండ్‌బీ గెస్టుహౌస్ సమావేశ భవనంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేటట్లు చూడాలన్నారు. చిన్నమల్కాపురం పీహెచ్‌సీ వైద్యుడు డా.చెన్నకేశవులు మాట్లాడుతూ కరోనాతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంఈవో ప్రభాకర్, ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, కొత్తబురుజు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రాంభూపాల్, ఏవో అబ్దుల్‌షఫీ, ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్యాపిలి, జనవరి 6: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ రక్త పరీక్షల వలన విద్యార్థులు తమ రక్త ఏ గ్రూపునకు చెందినదో తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నవీన్‌పాటి, రామకృష్ణ, సత్యబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'చెంచుల పిల్లలకు నాణ్యమైన విద్య'

రుద్రవరం, జనవరి 6: చెంచుల పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదనరెడ్డి, ఈవోపీఆర్‌డి శ్రీనివాసశర్మ అన్నారు. శనివారం మండలంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెం, హరినగరం చెంచుగూడెంలో గ్రామ సభలు నిర్వహించి చెంచుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. కార్యదర్శులు షాహినూర్, శివక్రిష్ణ తదితరులు ఉన్నారు.

'చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం'

శిరివెళ్ల, జనవరి 6: ఆహారంలో భాగంగా ప్రతిరోజూ చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సరళమ్మ తెలిపారు. మండలంలోని గోవిందపల్లె గ్రామంలో చిరుధాన్యాలు-వాటి ప్రాముఖ్యతపై మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలాజీ నాయక్, వ్యవసాయాధికారి ప్రభావతమ్మ, మహిళా రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు: ఏడీ

చాగలమర్రి, జనవరి 6: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణోత్సవాల్లో భాగంగా టీకాలు వేస్తున్నట్లు ఏడీ వరప్రసాదు తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఏడీ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 31వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల, జనవరి 6: మండలంలోని ముద్దవరం గ్రామానికి చెందిన సారా విక్రేత చెరువుపల్లె నాగమద్దయ్యను అరెస్టు చేసి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివశంకర్ నాయక్ శనివారం తెలిపారు. కొలుముపల్లె రస్తాలో ఉన్న చౌడేశ్వరి దేవాలయం సమీపంలో చెరువుపల్లె నాగమద్దయ్య నాటుసారా విక్రయిస్తుండగా అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితున్ని డోన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి



ఆళ్లగడలో ర్యాలీ



డోన్ మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన కార్మికులు

డోన్(రూరల్), జనవరి 6: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సమ్మె కొనసాగించారు. సీపీఎం, సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గడ్డి తింటూ నిరసన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీఐటీయూ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మున్సిపల్ కార్మికులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



డోన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గడ్డి తింటూ నిరసన



బేతంచెర్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కోవెలకుంట్ల, జనవరి 6: సౌత్‌జోన్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో కోవెలకుంట్ల చెందిన జ్యోతి విద్యానికేతన్ విద్యార్థులు మల్లికార్జున, రామచరణ్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సవిత్‌నాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సింధూరి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడలోని రవీంద్రభారతి పాఠశాలలో జరుగనున్న సౌత్‌జోన్ షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పరమేశ్వరరెడ్డి, పార్వతి, సురేశ్, శృతి తదితరులు పాల్గొన్నారు.

బంకులు తొలగించ వద్దని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బంకుల నిర్వాహకులు

బనగానపల్లె, జనవరి 6: పట్టణంలోని జూనియర్ కళాశాల ఎదురుగా పదేళ్ల నుంచి వేసుకున్న బంకులు తొలగించాలని అధికారులు ఉన్న ఫలంగా చెప్పడంతో నిర్వాహకులు శనివారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బంకులను తొలగించడానికి అధికారులు ఎక్స్‌కవేటర్లతో వచ్చారు. పదేళ్లుగా ఇక్కడే బంకులు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నామని, ఉన్న ఫలంగా తొలగిస్తే తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో రోడ్ల వెడల్పు కారణంగా పెట్రోల్ బంకు కూడలిలో స్థలాలు కోల్పోయిన 12 మందికి లక్షల విలువ చేసే భూమికి సెంటు చొప్పున అధికారులు అధికార పార్టీ నాయకుల ప్రమేయంతో పట్టాలు ఇచ్చినట్లు సమాచారం. ప్రాణం పోయినా బంకులు తొలగించబోమని అన్నారు. తమకు ఇక్కడే స్థలాలు కేటాయించాలని కోరారు.

'రైతులను ఆదుకోవాలి'



ర్యాలీ చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

బనగానపల్లె, జనవరి 6: స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకుడు, రైతు సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య కోరారు. శనివారం బనగానపల్లె పట్టణంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభలు శనివారం బనగానపల్లెలో నిర్వహించారు. జీఎం టాకీస్ నుంచి ర్యాలీగా బయలు దేరి పెట్రోల్ బంకు మీదుగా కొత్త బస్టాండ్ చేరుకొని నూకల రెసిడెన్సీ వద్ద సీపీఐ జెండాను ఆవిష్కరించారు. రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ దేశ సంపదను సృష్టించేవి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు అని అన్నారు. ఎన్టీ రామారావు రైతుల సంక్షేమానికి కృషి చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయన్నారు. ప్రస్తుత పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు పరిశ్రమల కోసం తక్కువ ధరలకు రైతుల భూములు ఇప్పించి రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో విప్లవ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు నారాయణ, సోమన్న, వెంకటశివుడు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రణాళికాబద్ధంగా చదవాలి'

డోన్(రూరల్), జనవరి 6: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని డోన్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జాస్మిన్ సూచించారు. పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు కలిసి పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బాక్సులను అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

చాగలమర్రి, జనవరి 6: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల అనర్థాలపై విద్యార్థులకు శనివారం చిత్తూరు జిల్లా రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల బానిసల పునరావాస కేంద్రం రాస్ కో-ఆర్డినేటర్ పి.నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు. రాస్ సంస్థ ద్వార మత్తుకు బానిసైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. హెచ్ఎం కోటయ్య, ఇన్‌చార్జి హెచ్ఎం శాస్త్రి, పీడీ దాదాపీర్, మురళీ పాల్గొన్నారు.